ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
సోమవారం 8 జనవరి 2024


ములుగులో ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలకు హాజరైన మహిళలు

ముగ్గు వేస్తున్న మంత్రి సీతక్క

నేలంతా వర్ణభరితం

ములుగులో ముందస్తు సంక్రాంతి

- ఘనంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు
- ముగ్గు వేసి పోటీలను ప్రారంభించిన రాష్ట్ర మంత్రి సీతక్క
- తెలుగు సంప్రదాయాలను కాపాడుకోవాలని పిలుపు
- తరిగిపోతున్న సంస్కృతిని 'ఆంధ్రజ్యోతి' కాపాడుతోందని ప్రశంస

ములుగు కలెక్టరేట్, జనవరి 7: ములుగుకు సంక్రాంతి పండుగ ముందే వచ్చేసింది. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు (బెంగుళూరు), రియల్ పార్టనర్ స్వర్ణసీమ సుకేతన) ఆదివారం ములుగులో ఘనంగా జరిగాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మహిళలు చుక్కల ముగ్గులు వేసి తీరొక్క రంగులు అద్దారు. గొబ్బెమ్మలు, పూలతో అలంకరించారు. దీంతో ఆ ప్రాంగణం రంగవళ్లులతో కళకళలాడింది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. మహిళలతో కలిసి ముగ్గులు వేసి రంగులు అద్దారు.

ముగ్గులతో సందడి

ముగ్గుల పోటీలతో సందడి నెలకొంది. ములుగు జిల్లాలోని ఆయా మండలాల నుంచి 60 మంది మహిళలు, యువతులు ముగ్గులు వేశారు. డీఆర్‌డీవో నాగపద్మజ, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు రియాజ్ మీర్జా, గొర్రెలు, మేకల పెంపకందారుల సొసైటీ ములుగు చైర్మన్ వంగ రవి యాదవ్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, మహర్షి విద్యా సంస్థల కరస్పాండెంట్ తుమ్మ పిచ్చిరెడ్డి తదితరులు ముగ్గులను తిలకించారు. పడమటింటి కవిత, విద్యాజ్యోతి, సౌజన్య న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా తీర్చిదిద్దిన రంగవళ్లులకు మార్కులు వేశారు.

విజేతలు వీరే..

ములుగు జిల్లా ముత్యాల ముగ్గుల పోటీ ప్రథమ విజేతగా ములుగు మండలం మహ్మద్‌గౌస్‌పల్లి గ్రామానికి చెందిన పసుల మౌనిక, ద్వితీయ విజేతగా జిల్లా కేంద్రానికి చెందిన నిఖిత, తృతీయ విజేతగా జి.పావని నిలిచారు. వీరికి జడ్పీ కోఆప్షన్ సభ్యుడు రియాజ్ మీర్జా, గొర్రెలు, మేకల పెంపకందారుల సొసైటీ ములుగు చైర్మన్ వంగ రవి యాదవ్ చేతుల మీదుగా రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3వేల చొప్పున నగదు బహుమతి, జ్ఞాపికలను అందజేశారు. అదే విధంగా స్పెషల్ కన్సొలేషన్ బహుమతి గెల్చుకున్న దుర్గాభవాని, గంధం కవితకు చీర, జ్ఞాపికలను పంపిణీ చేశారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ మహర్షి విద్యా సంస్థల కరస్పాండెంట్ తుమ్మ పిచ్చిరెడ్డి ప్రోత్సాహక బహుమతులు అందించారు.

సంస్కృతీ సంప్రదాయం..
ఆరోగ్యం : రాష్ట్ర మంత్రి సీతక్క

తెలుగు పండుగలలో సంస్కృతీ సంప్రదాయం, ఆరోగ్యం కలగలిసి ఉంటాయని, పూర్వీకులు మనకు అందించిన విలువైన సనాతన పద్ధతులను పరిరక్షిస్తూ భవిష్యత్ తరాలకు కానుకగా ఇవ్వాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ముగ్గుల పోటీలను ప్రారంభించిన అనంతరం ఆమె మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. పాశ్చాత్య సంస్కృతి వ్యాప్తి చెందుతున్న ప్రస్తుత తరుణంలో సంప్రదాయాలు ప్రమాదంలో పడ్డాయని అన్నారు. తరిగిపోతున్న ఆచారాలు, సంస్కృతి పరిరక్షణ కోసం ప్రతిఏటా సంక్రాంతికి ముందు ఆంధ్రజ్యోతి యాజమాన్యం ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మహిళల్లో పోటీతత్వం, ఆత్మస్థైర్యాన్ని పెంచుతాయని తెలిపారు. ముగ్గులో సంస్కృతితో పాటు ఆరోగ్యం ఉందని, పసుపు కుంకుమలు, ఆవు పేడతో చేసే గొబ్బెమ్మలు ఔషధంగా పనిచేస్తాయని పేర్కొన్నారు. తెలుగు సంస్కృతి మహిళలకు పెద్దపీట వేస్తోందన్నారు. భక్తితో కొలిచే బతుకమ్మను ఆడబిడ్డగా భావిస్తూ పసుపు గౌరమ్మను పెట్టి పూజిస్తామని తెలిపారు. పసుపుతో గడపను అలికితే ఆగడప దాటుకొని బ్యాక్టీరియా ఇంటి లోనికి రాదని తెలిపారు. జ్వరం వస్తే గోరువెచ్చని నీళ్లలో పసుపు వేసుకొని తాగిన తన బాల్యాన్ని గుర్తుచేసుకున్నారు. ఇప్పటికీ ఈ పద్ధతిని పాటిస్తున్నాని తెలిపారు. మన పండుగలు, సంప్రదాయాలు భక్తిభావాన్నే కాకుండా ఆరోగ్యాన్నీ పంచుతాయని శాస్త్రీయంగా నిరూపితమైందని వెల్లడించారు. తలుచుకుంటే ఏరంగంలోనైనా రాణించగలుగుతామనే స్థాయికి ప్రతి ఆడబిడ్డా ఎదగాలన్నారు. ముగ్గు వేసిన వేళ్లతోనే సమాజాన్ని చక్కదిద్దే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కావాలని ఆకాంక్షించారు. ఇందు కోసం మహిళలు ఉన్నత చదువులు చదవుకోవాలని సూచించారు. 'నేను ముగ్గు వేయక చాలా రోజులైంది. ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీ వల్ల ఆ అవకాశం వచ్చింది' అన్నారు. తెలుగు వారు ప్రపంచ నలుమూలల్లో ఎక్కడున్నా సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకోవాలని సీతక్క కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో నాగపద్మజ, డీపీఎం లీల, ఏపీఎం మహ్మద్ పాషా, సీసీలు విజయ, చంద్రమౌళి, వీవోఏలు కాంతాల మాధవి,

మిగతా 6వ పేజీలో..



మొదటి బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత మౌనిక



రెండో బహుమతి పొందిన ముగ్గు, విజేత నిఖిత


మూడో బహుమతి పొందిన ముగ్గు, విజేత పావని


ములుగులో మొదటి బహుమతి అందుకుంటున్న మౌనిక


మృతి చెందిన మల్లయ్య

డీసీఎం.. కారు ఢీ

- ఒకరి మృతి, నలుగురికి గాయాలు

మంగపేట, జనవరి 7: డీసీఎం, కారు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని కమలాపురం అంబేద్కర్ సెంటర్‌లో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామచంద్రునిపేట పంచాయతీ పరిధి సంగంపల్లికి చెందిన ఉప్పాల మల్లయ్య(60)పాటు జెట్టి పుల్లమ్మ, రాజ్యలక్ష్మి, ఆది సుగుణమ్మ, ఆది రమ కన్నాయిగూడెం మండలం గుర్రేవులలోని బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి శనివారం సాయంత్రం కారులో బయల్దేరారు. అనంతరం అర్ధరాత్రి సమయంలో సంగంపల్లికి తిరిగి వెళ్తుండగా కమలాపురం అంబేద్కర్ సెంటర్‌లో ఎదురుగా వచ్చిన డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. దీంతో మల్లయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. కారు డ్రైవర్ రాజు, ముగ్గురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. వారికి ఏటూరునాగారం సామాజిక వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం అనంతరం మల్లయ్య మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

టేకుమట్ల : బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని రాఘవరెడ్డిపేటలో ఆదివారం చోటచేసుకుంది. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మొగుళ్లపల్లి మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన కాంతల రాజిరెడ్డి, నల్ల రాజిరెడ్డి ద్విచక్రవాహనంపై మండలంలోని వెల్లంపల్లి గ్రామంలోని ఓ శుభకార్యానికి హాజరయ్యారు. తిరిగి వెళ్తుండగా రాఘవరెడ్డిపేట గ్రామంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడ్డారు. దీంతో వారికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇద్దరిని చిట్యాల సామాజిక ఆస్పత్రికి తరలించారు.

గురుకులాల్లో ప్రవేశాలకు
గడువు పెంపు

కాటారం, జనవరి 7: గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల గడువు పెరిగిందని ఎస్సీ, ఎస్టీ గురుకులాల ప్రిన్సిపాల్స్ బుచ్చయ్య, శైలజ, విజయ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 వరకు దరఖాస్తులు చేసుకునేందుకు గడువును పెంచారని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ద్వారా ప్రతిభ ఆధారంగా రాష్ట్రంలోని వివిధ గురుకులాల్లో విద్యార్థులను సీట్లు కేటాయిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కిక్కిరిసిన మేడారం

- వనదేవతలకు ముందస్తు మొక్కులు

మేడారం, జనవరి 7: తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క, సారలమ్మ వనదేవతలకు భక్తులు ముందస్తు మొక్కులు చెల్లిస్తున్నారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి లక్షకు పైగా భక్తుల తరలివచ్చారు. తల్లుల గద్దెల వద్ద పూలు, పండ్లు, చీరె, సారె, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా జంపన్నవాగు వద్ద పుణ్య స్నానాలు సమర్పించి కల్యాణ కట్ట వద్ద తలనీలాలు సమర్పించారు. అనంతరం గద్దెల వద్దకు చేరుకుని సమ్మక్క-సారలమ్మలకు జేజేలు పలుకుతూ శివసత్తు పూనకాలతో బాజాభజంత్రీలతో తల్లుల గద్దెలకు చేరుకున్నారు. అందరినీ చల్లగా చూడాలని వేడుకున్నారు.

మొక్కులు చెల్లించుకున్న బండ్ల గణేష్

మేడారం సమ్మక్క-సారలమ్మలను సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేష్ కుటుంబ సమేతంగా దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా పూజారులు గిరిజన సంప్రదాయాల ప్రకారం డోలువాయిద్యాల నడుమ ఘనస్వాగతం పలికారు. అమ్మవార్లకు గణేష్ నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని వనదేవతలను కోరుకున్నానని, తన ఆకాంక్ష నెరవేరడంతో మొక్కులు చెల్లించుకున్నానని తెలిపారు.

దర్శించుకున్న సబ్ రిజిస్ట్రార్ తస్లీమా

మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ మేడారం వనదేవతలను దర్శించుకున్నారు. పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, చీర, కొబ్బరికాయలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క-సారలమ్మల ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.


వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు



వనదేవతలను దర్శించుకునేందుకు వస్తున్న బండ్ల గణేష్, దర్శించుకుంటున్న సబ్ రిజిస్ట్రార్ తస్లీమా

కమనీయం...రమణీయం..

- వైభవంగా కొమురవెల్లి మల్లన్న కల్యాణం
- తిలకించి పులకించిన భక్తజనం
- ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- హాజరైన బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర ప్రముఖులు

చేర్యాల, జనవరి 7: ముక్కోటి దేవతలు, పంచభూతాల సాక్షిగా, వీరశైవపండితుల మంత్రోచ్ఛరణల నడుమ కొము రవెల్లి మల్లిఖార్జున స్వామి కేతలమ్మ, మేడలా దేవీలను వివాహమాడారు. సనాతన వీరశైవాగమశాస్త్రం ప్రకారం మార్గశిర మాసం చివరి ఆదివారం రోజును పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలోని తోటబావి ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కల్యాణ వేదికపై రమణీయంగా నిర్వహించారు.


కల్యాణానికి హాజరైన భక్తులు


వేడుకలకు హాజరైన మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్

కల్యణ క్రతువు..

వీరశైవార్చకులు మల్లికార్జునస్వామి, కేతమ్మ, మేడలాదేవీల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగిస్తూ మహిళల కోలోటాల నడుమ బాజాభజంత్రీల మధ్య కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. వరుడు మల్లి ఖార్జునస్వామి తరపున కన్యాగ్రహీతలుగా పడిగన్నగారి మల్లికార్జున్ దంపతులు, అమ్మవార్లు గొల్ల కేతమ్మ, మేడలాదేవీల తరపున కన్యాదాతలుగా మహదేవుని మనోహర్ దంపతులు వ్యవహరించారు. వేదికపై పట్టు వస్త్రాలతో ధగధగ లాడుతున్న దేవతామూర్తులు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి కల్యాణ నిర్వహణ తీరు, విశేషాలను డాక్టర్ మహంతయ్య, శశిభూషణ సిద్ధాంతి చేసిన వ్యాఖ్యానం భక్తులను అలరించింది.

పట్టువస్త్రాలు అందించిన మంత్రి కొండా సురేఖ

రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందజేశారు. బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. మాంగళ్యధారణ అనంతరం స్వామివారిని దర్శించుకుని మల్లన్న ఆలయాన్ని సందర్శించారు. మంత్రి సురేఖ కుటుంబ సభ్యులతో కలిసి పట్నంవేసి మొక్కు తీర్చుకున్నారు.

గంటన్నరపాటు కల్యాణం ఆలస్యం..

మల్లన్న కల్యాణం ఉదయం 10:45గంటలకు జరగాల్సి ఉండగా, మధ్యాహ్నం 12:28గంటలకు మాంగళ్యధారణ చేశారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి ముందే వచ్చినా మంత్రి కొండా సురేఖ ఆలస్యంగా చేరుకున్నారు.

సాంప్రదాయబద్ధంగా దృష్టికుంభం-బలిహరణ

తెల్లవారుజామున 4.30గంటలకు గర్భాలయ మండపంలోని వీరభద్రుడికి బలిహరణ చేసి దృష్టికుంభాన్ని ఘనంగా నిర్వహించారు. వీరశైవార్చకులు అన్నంరాశులపై గుమ్మడికాయలు నెలకొల్పి దండకాలతో హోరెత్తించిన అనంతరం గుమ్మడికాయను బలిఇచ్చి స్వామివారి తొలిదర్శనాన్ని ప్రారంభించారు. మల్లన్నకు చత్రకన్ను అమర్చి శతరుద్రాభిషేకం పూజలు నిర్వహించారు.



తాటిచెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

తాటి చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

హసన్‌పర్తి శివారులో 19 మందికి గాయాలు



గాయపడ్డ ప్రయాణికులను 108 ద్వారా ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

హసన్‌పర్తి, జనవరి 7: అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు తాటి చెట్టును ఢీ కొన్న సంఘటన ఆదివారం రాత్రి హసన్‌పర్తి శివారులో జరిగింది. హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ డిపోకు చెందిన బస్సు వరంగల్ నుంచి సిరిసిల్లకు వెళుతోంది. బస్సులో 55 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు హసన్‌పర్తి శివారులో ఉన్న రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయింది. అదుపు తప్పిన బస్సు రోడ్డు.. పక్కనే ఉన్న తాటి చెట్టును ఢీ కొంది. దీంతో అందులో ప్రయాణిస్తున్న 19 మందికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి, సబ్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌లు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డవారికి ప్రథమ చికిత్స చేసి, 108 ద్వారా మెరుగైన చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంగ్లీష్‌లో కవితకు డాక్టరేట్



కేయూ క్యాంపస్, జనవరి 7: కాకతీయ యూనివర్సిటీ ఇంగ్లీష్ విభాగం పరిశోధకురాలు ఎస్.కవితకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు ఆదివారం కవితకు డాక్టరేట్ ప్రకటించినట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 'థీమ్ ఆఫ్ డయాస్ పోరా ఇన్ ది నవెల్స్ ఆఫ్ అనిత రావ్ బాదమీ' అనే అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంథానిగాను డాక్టరేట్ ప్రకటించారు. కేయూ ఇంగ్లీష్ విభాగం ప్రొఫెసర్ వి. శ్రీనివాస్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. హనుమకొండ వడ్డెపల్లి ప్రభుత్వ మహిళ డిగ్రీ, పీజీ కళాశాలలో ఇంగ్లీష్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తారు.

ప్రభుత్వ పాలన శాస్త్రంలో శంకర్‌కు..

కాకతీయ యూనివర్సిటీ ప్రభుత్వ పాలన శాస్త్రం పరిశోధకుడు నిమ్మన గోటి. శంకర్‌కు డాక్టరేట్ లభించింది. 'ఇంప్లిమేంటేషన్ ఆఫ్ వెల్ఫేర్ మేజర్స్ అండ్ రెహబిలిటేషన్ స్కీమ్స్ ఫర్ విజుల్లీ డీస్సాబ్లెడ్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంథానిగాను డాక్టరేట్ ప్రకటించారు. కేయూ ప్రభుత్వ పాలనశాస్త్రం ప్రొఫెసర్ పింగళి నర్సింహరావు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం పరడ గ్రామానికి చెందిన శంకర్ కేయూలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

ద్విచక్రవాహనం చోరీ

హనుమకొండ క్రైం, జనవరి 7: హనుమకొండ పోలీసుస్టేషన్ పరిధిలోని లష్కర్ సింగారంలో ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం మస్నితండాకు చెందిన బానోతు బాలాజీ హనుమకొండ లష్కర్ సింగారంలో ఉంటూ దినసరి కూలీగా పని చేస్తున్నాడు. ఆదివారం లష్కర్ సింగారంలోని ఇంటి ముందు పార్కింగ్ చేసి బయటకు వెళ్లి వచ్చాడు. ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్ కనిపించకుండా పోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.



దామెర మండల కేద్రంలో వేలిముద్రలు తీసుకుంటున్న రేషన్ డీలర్ (ఫైల్)

ఈ- కేవైసీకి నెలాఖరు గడువు

రేషన్ దుకాణాలకు పరుగులు.. కొనసాగుతున్న ప్రక్రియ

హనుమకొండ రూరల్, జనవరి 7: రేషన్ కార్డులోని కుటుంబ సభ్యులకు ఈ-కేవైసీ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నెల 31వ తేదీ వరకు ప్రభుత్వం గడువు విధించింది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. రేషన్‌కార్డు లబ్ధిదారులందరి వేలిముద్రలు సేకరించాలని రేషన్ డీలర్లకు ఆదేశాలు రావడంతో ఈ-కేవైసీ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. రేషన్‌కార్డు ద్వారా పొందే బియ్యం దుర్వినియోగం అవుతున్నట్లు ప్రభుత్వాల దృష్టికి రావడంతో ఈ కేవైసీ తప్పనిసరి చేస్తూ ఆదేశించినట్లు తెలుస్తోంది. రేషన్‌కార్డులో పేరున్న ప్రతీ ఒక్కరు ఈ-పాస్ యంత్రాల ద్వారా వేలిముద్రలు డీలర్లు సేకరిస్తున్నారు. ఈ-కేవైసీ చేసుకోకుంటే బియ్యం ఇవ్వరనే వదంతులు వ్యాపించడంతో పెద్దఎత్తున రేషన్ దుకాణాలకు పరుగులు పెట్టారు. రేషన్ డీలర్లు బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలు సేకరించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 73శాతం ఈ- కేవైసీ పూర్తయినట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

రేషన్ దుకాణాలకు పరుగులు

ఈ-కేవైసీ ఈనెల 31వ తేదీతో ముగుస్తుండటంతో ప్రజలు రేషన్ దుకాణాలకు పరుగులు తీస్తున్నారు. ఇప్పటికే చాలా మంది వేలిముద్రలు ఇవ్వగా.. ఇంకా ఇవ్వని వారు గడువు సమీపిస్తుండటంతో ఎలాగైనా ఈ-కేవైసీ చేయించుకోవాలనే ఉద్దేశంతో రేషన్‌దుకాణాల ముందు వేచి ఉంటున్నారు. రేషన్ కార్డుల్లోని చిన్నారులకు ఆధార్‌కార్డు లేకపోవడంతో ఆధార్ నమోదు సెంటర్లకు పరుగులు తీస్తున్నారు.

ఈ- కేవైసీ 73శాతం పూర్తి

హనుమకొండ జిల్లా వ్యాప్తంగా 414 రేషన్ దుకాణాలు ఉండగా రేషన్ కార్డులు 2,28,143 ఉన్నాయి. ఇందులో ఆహార భద్రత కార్డులు 2,16,767, అంత్యోదయ కార్డులు 11352, అన్నపూర్ణ కార్డులు 24 ఉన్నాయి. మొత్తం 6,75,550 లబ్ధిదారులు ఉండగా ఇందులో ఇప్పటి వరకు 4,92,693 మంది మాత్రమే ఈ-కేవైసీ చేయించుకున్నారు. ఇంకా 1,82,857 మంది రేషన్ కార్డుదారులు ఈ- కేవైసీ చేయించుకోవాల్సి ఉంది. జిల్లాలో ఇప్పటి వరకు 73శాతం మంది ఈ- కేవైసీ చేయించుకున్నారు. మిగతావారు చేయించుకునేలా చర్యలు తీసుకోవాలని రేషన్ డీలర్లకు అధికారులు ఆదేశాలు ఇచ్చారు.

రేషన్ కార్డుదారులు ఈ-కేవైసీ చేసుకోవాలి :
జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి పి.వసంతలక్ష్మీ

జిల్లాలోని రేషన్ కార్డుదారులు విధిగా ఈ-కేవైసీ చేసుకోవాలి. పౌరసరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 31వ తేదీ వరకు ఇవ్వడం జరిగింది. రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ సమీపంలోని రేషన్ దుకాణాలలో వేలిముద్రలు (ఈ-కేవైసీ) ఇవ్వాలి. ఇప్పటి వరకు ఈ-కేవైసీ చేసుకోని లబ్ధిదారులు నెలాఖరులోగా పూర్తి చేసుకోవాలి.

కేయూ ఉద్యోగి మృతిపై ఉద్రిక్తత


మధుసూదన్ (ఫైల్)

- బిల్లులు రాలేదని ఒత్తిడితో మృతిచెందాడని బంధువుల ఆరోపణ
- మృతదేహాన్ని వర్సిటీకి తరలించి నిరసన.. వీసీ హామీతో విరమణ

కేయూ క్యాంపస్, జనవరి 7: కాకతీయ యూనివర్సిటీ ఉద్యోగి మధుసూదన్ (49) గుండెపోటులో ఆదివారం మృతి చెందారు. రెండు రోజుల కిందట మధుసూదన్‌కు గుండెపోటుకు గురికాగా, హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతుండగానే పరిస్థితి విషమించి మృతిచెందాడు. దీంతో ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, ప్రొఫెసన్ ఎస్. వాసుదేవారెడ్డి, ప్రొఫెసర్ బన్న అయిలయ్య, ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, డాక్టర్ ఎం.తిరుమలదేవి, డాక్టర్ మామిడాల ఇస్తారీలు హనుమకొండలోని పాత ఆర్టీవో ఆఫీస్ ప్రాంతంలో ఉన్న మృతుడి ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఉద్రిక్తత

మధుసూదన్ వర్సిటీలో ఉద్యోగం చేస్తూనే ఇటీవల కేయూ న్యాక్ పనుల్లో భాగంగా వర్సిటీకి కావాల్సిన ఫ్లెక్సీలు, ఇతర పనులు చేశారు. ఆయా బిల్లులు సుమారు రూ.20లక్షల మేరకు వర్సిటీ మధుసూదన్‌కు చెల్లించాల్సి ఉంది. అయితే రోజులు గడుస్తున్నప్పటికీ వర్సిటీ అధికారులు బిల్లులు ఇవ్వడం లేదని మానసిక ఆందోళనలతోనే మధుసూదన్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం మధుసూదన్ ఇంటికి వచ్చిన వర్సిటీ ఉన్నతాధికారులు ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. వర్సిటీ నుంచి మధుసూదన్‌కు రావాల్సిన డబ్బులను వెంటనే ఇప్పిస్తామని హామీఇచ్చారు. అయితే కుటుంబసభ్యులు తమకు స్పష్టమైన లిఖిత పూర్వకమైన హామీ కావాలని వర్సిటీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఒకటి., రెండు రోజుల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అయినా సంతృప్తి చెందక మధుసూదన్ మృతదేహాన్ని వర్సిటీ పరిపాలన భవనం ఎదుట ఉంచి నిరసన ఆందోళన చేసేందుకు వర్సిటీకి తరలించారు. అయితే పోలీసులు వెంటనే అప్రమత్తమై మృతదేహాన్ని వర్సిటీలోనికి తీసుకురాకుండా మొదటి గేటువద్ద అడ్డుకున్నారు. ఈ క్రమంలో మృతుడి బంధువులకు, పోలీసులతో వాగ్వాదం జరిగింది. చివరకు మధుసూదన్ మృతదేహంతో పరిపాలన భవనం ఎదుట నిరసనలకు దిగారు. దీంతో వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు రంగంలోకి దిగారు. మధుసూదన్‌కు రావాల్సిన డబ్బులన్ని వెంటనే చెల్లిస్తామని ఫోన్‌లో కుటుంబసభ్యులకు స్పష్టమైన హామీ ఇచ్చారు. మధుసూదన్ వైద్య ఖర్చుల కోసం ఇటీవల రూ.3 లక్షలు చెల్లించామని, మిగతా డబ్బులు సోమవారం చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సందర్శించిన తోటి ఉద్యోగులు

మధుసూదన్ మృతి విషయం తెలుసుకున్న తోటి ఉద్యోగులు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నేతలు, వర్సిటీ కాంట్రాక్టు, పార్టుటైం అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు భారీగా తరలి వచ్చారు. అనంతరం పోచమ్మకుంటలోని హిందూ స్మశాన వాటికలో మధుసూదన్ అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, మృతుడికి భార్య కోమల, కూతురు మనస్విని, కొడుకు తేజలున్నారు.


కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వర్సిటీ అధికారులు తాళ్లపల్లి మనోహర్, ప్రొఫెసర్ మల్లారెడ్డి తదితరులు


హనుమకొండలో జరిగిన ముగ్గుల పోటీలో ముగ్గులను పరిశీలిస్తున్న మహిళా పోలీసు అధికారులు, ఆంధ్రజ్యోతి సిబ్బంది

అలరించిన రంగవల్లులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో విజయవంతంగా ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలు


మహబూబాబాద్‌లో కెనరా బ్యాంక్ మేనేజర్ శోభన్‌కు మెమోంటో అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్


మహబూబాబాద్‌లో లోగో ముగ్గులు వేసిన చిన్నారి సరెడ్డి సాయి స్ఫూర్తికి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్


వరంగల్‌లోని ఏవీవీ కళాశాలలో ముగ్గులను పరిశీలిస్తున్న కార్పొరేటర్లు


వరంగల్‌లోని ఏవీవీ కళాశాలలో ముగ్గులను పరిశీలిస్తున్న పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా


జనగామలో ముగ్గులను పరిశీలిస్తున్న కలెక్టర్, ఆయన సతీమణి


జనగామలో లోకల్ స్పాన్సర్ 'శ్రీలక్ష్మీ షాపింగ్ మాల్' అధినేత భోగ కైలాసంను సత్కరిస్తున్న ఆంధ్రజ్యోతి బృందం


హనుమకొండలోని ముగ్గుల పోటీలో పాల్గొన్న చిన్నారులకు డిక్షనరీలను అందచేస్తున్న విక్రమ్ పబ్లిషర్ ప్రతినిధి శ్రీనివాస్


హనుమకొండలోని ముగ్గులో పోటీలో ప్రసంగిస్తున్న జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్


హనుమకొండలోని ముగ్గుల పోటీలో పాల్గొని ముగ్గులు వేస్తున్న చిన్నారులు


హనుమకొండలో మాట్లాడుతున్న కాజీపేట ట్రాఫిక్ సీఐ సుజాత


ములుగులో జరిగిన ముగ్గుల పోటీల సందర్భంగా మాట్లాడుతున్న మంత్రి సీతక్క


ములుగులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు


హనుమకొండలో జరిగిన ముగ్గుల పోటీల బహుమతి ప్రదానోత్సవంలో ప్రసంగిస్తున్న ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ వి.రఘుపతిరావు

ఘనంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు



ములుగులో ముగ్గుల పోటీలకు హాజరైన మహిళలు



రెండో బహుమతి అందుకుంటున్న నిఖిత



మూడో బహుమతి అందుకుంటున్న పావని



మంత్రి సీతక్కను సన్మానిస్తున్న ఆంధ్రజ్యోతి ములుగు జిల్లా సిబ్బంది



మాట్లాడుతున్న డీఆర్డీవో నాగపద్మజ



మాట్లాడుతున్న కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవి యాదవ్

నేలంతా వర్ణభరితం

3వ పేజీ తరువాయి

యాసం సునీత, జయప్రద, ఆంధ్రజ్యోతి ములుగు జిల్లా ఇన్‌చార్జి దూడబోయిన రాకేష్, రిపోర్టర్లు నెక్కంటి సునీల్ కుమార్, గున్నాల తిరుమల్‌రెడ్డి, దేశిని మహేందర్, కోగిల సారయ్య, వసంత రమేష్, ఎర్రం స్వామి, పసుపులేటి సతీష్, దుర్గం రాజు, ఫొటో గ్రాఫర్ పాలకుర్తి మధు, సర్క్యులేషన్ ఇన్‌చార్జి బత్తిని రాజేష్, ఖాసిందేవిపేట సర్పంచ్ అహ్మద్‌పాషా, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోతు రవిచందర్, పీఏసీఎస్ ఛైర్మన్ బొక్క సత్తిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎమ్డీ.చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

గోదావరి తీరంలో కోలాహలం

మహదేవపూర్, జనవరి 7: మండలంలోని కాళేశ్వరంలో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు కాళేశ్వరం చేరుకున్నారు. గోదావరిలో స్నానాలు ఆచరించారు. ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. దీంతో ఆలయానికి భారీగా ఆదాయం సమకూరింది.



కాళేశ్వరంలో గోదావరి వద్ద భక్తులు

మల్లిపల్లిలో బోనాల జాతర ప్రారంభం



మల్లన్న ఆలయం వద్ద పచ్చని పందిరి కార్యక్రమంలో నిర్వాహకులు

కాటారం, జనవరి 7:మండలంలోని ప్రతాపగిరి గ్రామపంచాయతీ పరిధిలోని మల్లిపల్లిలో రెండు రోజుల పాటు జరిగే బోనాల జాతర ఉత్సవం ఆదివారం ప్రారంభమైంది. ఆలయం ఎదుట పచ్చని పందిరి వేయడం, మల్లన్నకు ప్రత్యేక అలంకరణలు, పూజలు వంటి కార్యక్రమాలు చేపట్టారు. సోమవారం మల్లన్న పట్నాలు, బోనాలు వండి సమర్పించడం, కల్యాణం పెద్ద ఎత్తున జరుగుతుందని ఆలయ కమిటీ ప్రతినిధులు, నిర్వాహకులు తెలిపారు. మల్లన్న బోనాల జాతరలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని సర్పంచ్ గుంటి లక్ష్మి, ఎంపీటీసీ రవీందర్‌రావు, మాజీ సర్పంచ్ ఊర వెంకటేశ్వర్‌రావు, ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

రామప్పలో సందడే సందడి

వెంకటాపూర్(రామప్ప), జనవరి 7: మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప రామలింగేశ్వర స్వామి దేవాలయంలో పర్యాటకులు, విద్యార్థులతో సందడి నెలకొంది. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ దూర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో సందర్శించారు. ఈసందర్భంగా వారు రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించడంతోపాటు నందీశ్వరుడిని దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టారు. ఆలయ శిల్పకళా సౌందర్యాన్ని తిలకించి ఆలయ చరిత్ర గురించి గైడ్‌లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడినుంచి సరస్సు వద్దకు చేరుకుని బోటు షికారు చేస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

మాజీ కేంద్ర మంత్రి పర్యటన

రామప్ప దేవాలయాన్ని ఆదివారం మాజీ కేంద్రమంత్రి సర్వే సత్యనారాయణ సందర్శించారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు, పూజారులు ఆయనను సాదరంగా ఆహ్వానించగా రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అదే విధంగా ఆలయానికి తూర్పు ముఖద్వారాన ఉన్న నందీశ్వరుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి కొబ్బరికాయ కొట్టారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ శిల్పకళా వైభవాన్ని వీక్షించి టూరిజం గైడ్ తాడబోయిన వెంకటేష్ ద్వారా ఆలయ చరిత్రను తెలుసుకుని అబ్బురపడ్డారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.



శిల్పకళా సంపదను తిలకిస్తున్న మాజీ కేంద్ర మంత్రి సత్యనారాయణ

మేడారంలో ముమ్మరంగా అభివృద్ధి పనులు

మేడారం, జనవరి 7: తాడ్వాయి మండలం మేడారంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా వనదేవతల స్థలాలకు ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. దేవాదాయ శాఖకు చెందిన సమ్మక్క, సారలమ్మల భూములను కబ్జాకు గురికాకుండా రక్షణ చర్యలు చేపట్టారు. మేడారం, రెడ్డిగూడెంను ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 100లో 28ఎకరాల భూమిని గతంలో ట్రైబల్ విలేజ్‌గా రూపొందించడానికి రెవెన్యూ శాఖ అధికారులు కేటాయించారు. అయితే ఈ భూమిని ఎవరూ కబ్జా చేయకుండా రక్షణ చర్యలు చేపట్టారు. సుమారు రూ. 50లక్షల దేవాదాయ శాఖ నిధులతో ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆర్అండ్‌బీ పనుల ప్రారంభం

మహాజాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయా రంగాల అధికారులు తమ పనులకు చకచకా కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్అండ్‌బీ అధికారులు రోడ్ల మరమ్మతులను ఆదివారం ప్రారంభించారు. అదే విధంగా ఇరిగేషన్ శాఖ అధికారులు జంపన్నవాగు ఇసుక చదును పనులు కూడా చేస్తున్నారు. దీంతో భక్తులకు పుణ్యస్నానాలు, రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. జనవరి నెలాకరులోగా పనులు పూర్తికావాలని మంత్రి సీతక్క సూచించిన నేపథ్యంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి పనులకు శ్రీకారం చుట్టారు. .



ఫెన్సింగ్ కోసం చదును చేస్తున్న ఎక్స్‌కావేటర్



ఇసుకను చదును చేస్తున్న డోజర్

ప్రజాపాలన దరఖాస్తుదారులు అప్రమత్తంగా ఉండాలి

గణపురం, జనవరి 7: ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారు సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మచ్చ సాంబమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రజాపాలన దరఖాస్తులో మీ పథకాలు మంజూరు చేస్తామని చెప్పి ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీ అడిగితే చెప్పొద్దని తెలిపారు. అలా ఎవరైనా ఫోన్ చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు.

ఏఐటీయూసీ విజయోత్సవ ర్యాలీ



ర్యాలీలో ఏఐటీయూసీ నాయకులు

కాకతీయఖని, జనవరి 7: ఇటీవల జరిగిన ఎన్నికల్లో సింగరేణి వ్యాప్తంగా గుర్తింపు సంఘంగా గెలిచిన ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భూపాలపల్లిలో ఆదివారం విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. పట్టణంలోని కొమురయ్య భవన్ వద్ద నుంచి ప్రారంభమైన ఈ ప్రదర్శన కారల్‌మార్క్స్ కాలనీ, హనుమాన్‌టెంపుల్ మీదుగా అంబేడ్కర్ సెంటర్ వరకు కొనసాగింది. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, భూపాలపల్లి బ్రాంచి కార్యదర్శి మోటపలుకుల రమేష్, నాయకులు కృష్ణ, సత్యనారాయణ, రామచందర్ పాల్గొన్నారు.

సివిల్, సీఆర్‌పీఎఫ్ బలగాల మధ్య క్రికెట్ పోటీలు



క్రికెట్ కిట్‌ను అందిస్తున్న ఇన్‌స్పెక్టర్లు

కాటారం, జనవరి 7: కాటారం సివిల్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాల మధ్య ఆదివారం సాయంత్రం ఫ్రెండ్లీ క్రికెట్ పోటీలు జరిగాయి. కాటారం సీఐ రంజిత్‌రావు, సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి పోలీసులకు క్రికెట్ కిట్లు అందించారు. పలువురు సిబ్బంది క్రీడా స్ఫూర్తిని చాటుతూ క్రికెట్ మ్యాచ్‌లో ప్రతిభను చాటారు. ఈ కార్యక్రమంలో కాటారం ఎస్సై అభినవ్ పాల్గొన్నారు.

మల్లూరులో చోరీలు

మంగపేట, జనవరి 7: మండలంలోని మల్లూరు సాయిబాబా ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తి ఇనుప గ్రిల్స్‌ను ధ్వంసంచేసి లోపలికి చొరబడి హుండీని పగుల గొట్టి అందులోని కానుకలను అపహరించారు. అలాగే ఆలయానికి సమీపంలోని కిరాణా దుకాణం తలుపులు పగులగొట్టి గల్లాపెట్టెలోని రూ.4,500ను దొంగలించారు. పూజారులు, దుకాణం యజమాని చీకటి రాణి ఇచ్చిన ఫిర్యాదుతో మంగపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్‌స్టేషన్ ఆవరణలో స్వచ్ఛ భారత్

కాటారం, జనవరి 7: మండల కేంద్రంలోని కాటారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి ఆధ్వర్యంలో 58 బెటాలియన్ సీఆర్పీఎఫ్, కాటారం ఎస్సై మ్యాక అభినవ్, పీఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో సివిల్ సిబ్బంది పాల్గొన్నారు. చెత్తా చెదారాన్ని, పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించి శుభ్రం చేశారు. పూల మొక్కల చుట్టూ కలుపును తీసేసి గుంతలు ఏర్పాటు చేశారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

వైభవంగా అయోధ్య అక్షింతల పంపిణీ

కాటారం, జనవరి 7: అయోధ్యలో జరపబోయే శ్రీరామవిగ్రహ ప్రాణప్రతిష్ట అక్షింతల పంపిణీ కార్యక్రమం మండల కేంద్రమైన కాటారం భక్తాంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా సాగింది. సన్నాయి వాయిద్యాలు, మహిళలు మంగళహారతులు, భక్తుల జైశ్రీరాం, జైహనుమాన్ నామాల మధ్య శోభా యాత్రను నిర్వహించారు. భక్తాంజనేయ స్వామి ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామంలోని పలు వీధుల మీదుగా శోభాయాత్ర చేపట్టి అక్షింతలను ఇంటింటా పంపిణీ చేశారు. ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఉప సర్పంచ్ నాయిని శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్షుడు చీర్ల శ్రావణ్, ప్రతినిధులు, గ్రామపెద్దలు అశోక్, చంద్రయ్య, మూర్తి, నవీన్, రాజబాపు, అచ్చుకుడు నిఖిల్ పాల్గొన్నారు.

గొత్తికోయలకు దుప్పట్లు పంపిణీ చేసిన మంత్రి సీతక్క



గొత్తికోయ మహిళలకు దుప్పటి అందజేస్తున్న మంత్రి సీతక్క

తాడ్వాయి, జనవరి 7: మండలంలోని కామారం, జలగలంచ, మండలతోగు గొత్తికోయగూడాల్లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క కాంగ్రెస్ నాయకులు, అధికారులతో కలిసి ఆదివారం పర్యటించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరువవుతాయని, ఎవరూ అధైర్యపడొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రేగ కల్యాణి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, తాడ్వాయి సర్పంచ్ ఇర్ప సునీల్, ములుగు డీఎస్పీ రవీందర్, నాయకులు గంట సాయి, జనార్ధన్, సిద్దిరెడ్డి పాల్గొన్నారు.

యూటీఎఫ్ నేతల వినతి

ములుగు కలెక్టరేట్ : గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ములుగులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు మంత్రి ధనసరి సీతక్కకు వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని, ఉపాధ్యాయులను బోధనేతర కార్యకలాపాల నుంచి రిలీవ్ చేయాలని, నైట్ డ్యూటీ, హాలిడే డ్యూటీ వంటి సమస్యలను పరిష్కరించి కేర్ టేకర్స్‌ను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ గురుకుల ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎస్.భిక్షపతి, ప్రధాన కార్యదర్శి నళిని, ఉపాధ్యక్షులు రహీం, మాధవి, సైదాయాస్మిన్, కోశాధికారి షకీల్ అహ్మద్, రాజ్‌కుమార్, రాజశేఖర్, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిత్రకారులను ఆదుకోవాలి

రేగొండ, జనవరి 7: కళా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటు అందించి చిత్రకారుల కుటుంబాలకు అండగా నిలవాలని ఆర్టిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని కోటంచ దేవాయం ఆవరణలో జిల్లా ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఆర్టిస్టుల సమస్యలపై అవగాహన ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వారి సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. వృద్ధ ఆర్టిస్టులకు పెన్షన్ ఇవ్వాని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు తిరుణహరి శ్రీనివాస్, చందర్, మొలుగూరి రాజు, తిరుమల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు జడ్పీటీసీ రాజీనామా

చిన్నగూడూరు (మహబూబాబాద్ జిల్లా), జనవరి 7 : బీఆర్ఎస్‌కు చిన్నగూడూరు జడ్పీటీసీ మూల సునీత మురళీధర్‌రెడ్డి రాజీనామా చేశారు. దాని ప్రతీని జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవితకు పంపారు. మండల పరిధి గుండంరాజుపల్లిలోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ తన రాజకీయ లబ్ధి కోసం ఎంతో మందిని అణగతొక్కారని ఆరోపించారు. కష్టపడి పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను మరిచి, అక్రమ వ్యాపారులకు అండగా నిలిచారని ఆరోపించారు. ఉగ్గంపల్లి సర్పంచ్ అప్పులపాలై ఎకరం భూమి అమ్ముకున్నప్పుడే రెడ్యా నైతికంగా ఓడారని, డోర్నకల్ నియోజకవర్గంలో తిరిగే నైతికహక్కు ఆయనకు లేదని అన్నారు. మండల కేంద్రంలో నిర్మించిన 81 డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా ఎందుకు ఆపారని ప్రశ్నించారు. రెడ్యా వైఖరి నచ్చకే పార్టీకి రాజీనామా చేసినట్టు తెలిపారు. గ్రామాన్ని అభివృద్ధి చేస్తూ తమ మనోభావాలకు గౌరవించే వారికి మద్దతిస్తామని స్పష్టం చేశారు.

గట్టమ్మను దర్శించుకున్న బండ్ల గణేష్



బండ్ల గణేష్‌కు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

ములుగు, జనవరి 7: సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేష్ ఆదివారం గట్టమ్మతల్లిని దర్శించుకున్నారు. మేడారం సమ్మక్క, సారక్క దర్శనానికి వెళ్తున్న క్రమంలో ములుగు సమీపంలోని గట్టమ్మ దేవాలయాన్ని ఆయన సందర్శించారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. గట్టమ్మ తల్లికి ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం గణేష్ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నియంత పాలన కూలిందని, ఆరు గ్యారెంటీ పథకాలను సమర్థంగా అమలు చేసేందుకు కృషిచేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కకు కృతజ్ఞతలని అన్నారు. సమ్మక్క, సారక్క, గట్టమ్మ దీవెనలతో రాష్ట్రం సుభీక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు రియాజ్‌మీర్జా, ఖాసిందేవిపేట సర్పంచ్ అహ్మద్‌పాషా, కాంగ్రెస్ ములుగు పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు గండె శ్రీను, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కోటి, నాయకులు దూడబోయిన వేణుయాదవ్, ఓడ రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.